జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
శనివారం
05-09-2026
సంపుటి 1 సంచిక 284
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195




'ఈఓఎస్-05' సక్సెస్.. ఇస్రో సత్తా! 4లో



## సురేఖ భర్తరఫ్ బాధ కలిగించింది
### డీకే అరుణ

**దశ, హైదరాబాద్:** మాజీ మంత్రి కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి భర్తరఫ్ చేయడం బాధ కలిగించిందని బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. కొండా సురేఖ సీనియర్ మహిళా నాయకురాలని, కాంగ్రెస్‌లోని అంతర్గత రాజకీయ విభేదాలే ఆమె భర్తరఫ్‌కు దారితీశాయని భావిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీల్లో గ్రూపులు, విభేదాలు సహజమేనని, అయితే కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు తరచూ కనిపిస్తున్నాయని డీకే అరుణ వ్యాఖ్యానించారు. 2009లో తాను, కొండా సురేఖ ఇద్దరూ మంత్రులుగా కలిసి పనిచేశామని

..మిగతా 4వ పేజీలో →

# లైన్ దాటితే వేటు!
## క్లారిటీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
### పార్టీ క్రమశిక్షణపై కఠిన సంకేతాలు

**దశ, హైదరాబాద్:** తెలంగాణ కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనదైన ముద్ర వేస్తున్నారా? కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడం, పార్టీ క్రమశిక్షణ విషయంలో కఠినంగా వ్యవహరించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ లైన్ దాటి వ్యవహరించే నేతలకు ఇక ఉపేక్ష ఉండదనే సంకేతాన్ని ఈ పరిణామం ద్వారా ఇచ్చారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన పూర్తయిన సమయంలోనే సొంత పార్టీలో అంతర్గత విభేదాలు, మరోవైపు బీఆర్ఎస్, బీజేపీల విమర్శలు ప్రభుత్వానికి సవాలుగా మారాయి. ఈ నేపథ్యంలో కొండా సురేఖ వ్యవహారంలో తీసుకున్న నిర్ణయం ద్వారా పార్టీపై తన నియంత్రణను రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. రేవంత్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో.. అధిష్ఠానం అనుమతితో సురేఖను కేబినెట్ నుంచి తొలగించారు. ఈ నిర్ణయం పార్టీ క్రమశిక్షణ విషయంలో అధిష్ఠానం, రాష్ట్ర నాయకత్వం



కలిసి కఠిన వైఖరి అవలంబిస్తున్నాయనే సంకేతాన్ని ఇచ్చిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తనను తొలగించకపోతే తానే తప్పుకుంటానని రేవంత్‌రెడ్డి హైకమాండ్‌కు చెప్పినట్లు సురేఖ చేసిన ఆరోపణలు కూడా ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి. అయితే దీనిపై అధికారిక నిర్ధారణ లేదు. మరోవైపు ఢిల్లీ పర్యటనలో అధిష్ఠానంతో సమావేశమైన రేవంత్‌రెడ్డి మంత్రివర్గ విస్తరణకు ఆమోదం పొందినట్లు తెలుస్తోంది. నలుగురు కొత్త ముఖాలను కేబినెట్‌లోకి తీసుకునే అవకాశం ఉండటంతో.. అసంతృప్త నేతలకు సర్దుబాటు చేయడంతో పాటు ప్రభుత్వంపై తన పట్టును మరింత బలోపేతం చేసుకునే అవకాశం రేవంత్‌రెడ్డికి లభించనుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక బీఆర్ఎస్, బీజేపీలు ప్రభుత్వ హామీలు, పాలనా వైఫల్యాలను లక్ష్యంగా చేసుకుని పోరాటాలు ముమ్మరం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరగకుండా సంక్షేమ పథకాలను మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం, పెట్టుబడులుఅభివృద్ధిపై దృష్టి పెట్టడం రేవంత్‌రెడ్డి ముందున్న ప్రధాన సవాళ్లుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కొండా సురేఖ ఎపిసోడ్‌తో పార్టీకి ఒక సందేశం.. కేబినెట్ విస్తరణతో మరో సంకేతం. మొత్తంగా కాంగ్రెస్‌లో తన నాయకత్వంపై రేవంత్‌రెడ్డి మరింత స్పష్టత ఇస్తున్నారన్న చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో సాగుతోంది.



### ముఖ్యమంత్రీ..
# చెత్త పనులు మానుకో!
## ప్రాపర్టీ ట్యాక్స్‌తో పాటు చెత్త పైసలు వసూలు చేస్తారా?
### స్వచ్ఛ ఆటో కార్మికుల పొట్టకొడితే చూస్తూ ఊరుకోం: కల్వకుంట్ల కవిత

**దశ, హైదరాబాద్:** మున్సిపల్ శాఖను కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెత్త పనులు మానుకోవాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. రాంకీ సంస్థకు చెత్త సేకరణ బాధ్యతలు అప్పగించే ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో స్వచ్ఛ ఆటో కార్మికులతో ఆమె సమావేశమయ్యారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా స్వయం ఉపాధి పొందుతున్న స్వచ్ఛ ఆటో కార్మికులను రాంకీ సంస్థకు జీతగాళ్లుగా మార్చే ప్రయత్నం దారుణమని కవిత మండిపడ్డారు. రాంకీ సంస్థకు

..మిగతా 4వ పేజీలో →



## పట్టాలపై పరుగులు తీస్తున్న ఫైవ్ స్టార్ హోటల్!
### వందే భారత్ స్లీపర్‌లో విలాసవంతమైన సౌకర్యాలు..
### ప్రైవేట్ క్యాబిన్లు, హోటల్ తరహా టాయిలెట్లు, షవర్ కూడా

**దశ, హైదరాబాద్ :** రైలు ప్రయాణం అంటే ఒకప్పుడు సాధారణ సౌకర్యాలతో సుదూర ప్రయాణం. కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోంది. ప్రయాణికులకు వేగంతో పాటు అత్యాధునిక, విలాసవంతమైన సౌకర్యాలను అందించేందుకు భారతీయ రైల్వేలు వందే భారత్ స్లీపర్ రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చాయి. కొత్త స్లీపర్ కోచ్‌లలోని సౌకర్యాలను చూస్తే.. పట్టాలపై పరుగులు తీస్తున్న ఫైవ్ స్టార్ హోటల్‌ను తలపిస్తున్నాయి. వందే భారత్ స్లీపర్ కోచ్‌కు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందులో కనిపిస్తున్న ప్రైవేట్ క్యాబిన్లు, ప్రీమియం ఫినిషింగ్, ఆధునిక లైటింగ్, విశాలమైన స్థలం ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. రాత్రి ప్రయాణాల్లో సౌకర్యవంతంగా నిద్రించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం వందే భారత్ రైళ్లలో ప్రధానంగా చైర్‌కార్ సదుపాయం ఉండగా.. సుదూర రాత్రి ప్రయాణాల కోసం స్లీపర్ వెర్షన్‌ను ప్రవేశపెట్టారు. ముఖ్యంగా ఫస్ట్ ఏసీ కోచ్‌లో ప్రయాణికులకు మరింత విశాలమైన క్యాబిన్లు, మెరుగైన గోప్యత, హాట్ వాటర్ షవర్ వంటి సదుపాయాలు కల్పించారు.

#### సౌకర్యాల్లో అదుర్స్!

వందే భారత్ స్లీపర్‌లో విలాసవంతమైన బెర్త్‌లతో పాటు రీడింగ్ లైట్లు, మొబైల్ ఛార్జింగ్ పోర్టులు, ఆటోమేటిక్ డోర్లు, సెన్సార్ ట్యాపులు, బయోవాక్యూమ్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు. సాధారణ రైళ్లలో కనిపించే దుర్వాసన సమస్యకు చెక్ పెట్టేలా ఆధునిక టాయిలెట్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. ప్రయాణికుల భద్రత కోసం అత్యాధునిక సీసీ కెమెరాలు, ప్రయాణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేసే డిస్‌ప్లే స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. వందే భారత్ స్లీపర్ సర్వీస్ ఈ ఏడాది జనవరిలో హౌరాకామాఖ్య మధ్య ప్రారంభమైంది. ప్రస్తుతం ఈ రైలులో

..మిగతా 4వ పేజీలో →

### మహిళలకు హామీల వల..
# అమలులో కాంగ్రెస్ మోసం!

#### 1000 రోజుల పాలనలో ఒక్క హామీకి దిక్కులేదు.
#### కేసీఆర్ కిట్ సహా సంక్షేమ పథకాలు నిలిపివేసి అన్యాయం
#### మంచిరెడ్డి కిషన్‌రెడ్డి.. ప్రశాంత్‌కుమార్‌రెడ్డి



**దశ, మంచాల :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాట కార్యక్రమాల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో శుక్రవారం మహిళా సదస్సు నిర్వహించారు. బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి (బంటి) ఈ కార్యక్రమంలో పాల్గొని మహిళల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మహిళలకు అనేక హామీలు ఇచ్చినకాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా తీవ్రంగా మోసం చేసిందని ఆరోపించారు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని, సంక్షేమ పథకాల ద్వారా అండగా ఉంటామని హామీ ఇచ్చి ఇప్పుడు మాట తప్పిందని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, అదే సమయంలో మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడే అనేక హామీలను పక్కన పెట్టిందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ముఖ్యమైన వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, తులం బంగారం, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేసిందని వారు గుర్తుచేశారు. ముఖ్యంగా కేసీఆర్ కిట్ వంటి పథకాల ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించడంతో పాటు తల్లీబిడ్డల ఆరోగ్యానికి భరోసా కల్పించామని తెలిపారు. అలాంటి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయడం ద్వారా పేద, మధ్యతరగతి మహిళలకు అన్యాయం చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో మహిళా సంఘాలకు పెద్దపీట వేసి, స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక అవకాశాలు కల్పించామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. మహిళలకు

..మిగతా 4వ పేజీలో →



4లో

## అసెంబ్లీ సమరానికి బీఆర్ఎస్ వ్యూహం!
### సెప్టెంబర్ 6న కేసీఆర్ అధ్యక్షతన శాసనసభాపక్ష సమావేశం

# సీఎంగానే అసెంబ్లీలోకి..!
### కేసీఆర్ నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో చర్చ.

**దశ, హైదరాబాద్ :** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నికైన తర్వాతే అసెంబ్లీలో అడుగుపెడతారని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చకు దారితీసింది. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకావడం లేదన్న అంశంపై అధికార, ప్రతిపక్ష వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత కేసీఆర్ శాసనసభకు

..మిగతా 4వ పేజీలో →





# ఐఫోన్ కోసం గంజాయి దందా!
### ప్రియురాలి బర్త్‌డే గిఫ్ట్ కోసం రూ.16 వేలతో 12 కిలోలు కొనుగోలు.. హైదరాబాద్‌లో రూ.6 లక్షలకు విక్రయించేందుకు ప్లాన్

**దశ, ఖమ్మం:** ప్రియురాలి పుట్టినరోజుకు ఐఫోన్ గిఫ్ట్‌గా ఇవ్వాలన్న ఆశ ఓ యువకుడిని గంజాయి స్మగ్లింగ్ వైపు నడిపించింది. ప్రియురాలితో కలిసి ద్విచక్ర వాహనంపై

..మిగతా 4వ పేజీలో →

# సీఎంగానే అసెంబ్లీలోకి!

**మొదటి పేజీ తరువాయి**

ఎన్నికైనప్పటికీ.. అసెంబ్లీ సమావేశాలకు ఆయన పెద్దగా హాజరుకాలేదు. ప్రతిపక్ష నేతగా సభకు హాజరై ప్రభుత్వ విధానాలపై ప్రశ్నించడం, ప్రజా సమస్యలను ప్రస్తావించడం రాజకీయంగా కీలకమని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయిన తర్వాతే సభలోకి వస్తారన్న కేటీఆర్ ప్రకటనను బీఆర్ఎస్ వర్గాలు తమ రాజకీయ వ్యూహంలో భాగంగా చూస్తున్నాయి. గతంలో పలువురు రాజకీయ నేతలు అసెంబ్లీలో ఎదురైన పరిణామాల అనంతరం ప్రజల్లోకి వెళ్లి తిరిగి అధికారంలోకి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. తమిళనాడులో జయలలిత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు రాజకీయ పోరాటాల ద్వారా తిరిగి అధికారాన్ని సాధించిన ఉదాహరణలను రాజకీయ విశ్లేషకులు ప్రస్తావిస్తున్నారు. అయితే ఆయా సందర్భాల రాజకీయ పరిస్థితులు, కారణాలు వేర్వేరుగా ఉండటంతో వాటిని ప్రస్తుత పరిస్థితితో పూర్తిగా పోల్చడం సరికాదనే అభిప్రాయాలు కూడా ఉన్నాయి. కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకాకపోవడంపై బీఆర్ఎస్ నుంచి స్పష్టమైన రాజకీయ కారణాలు వెల్లడికావాల్సి ఉంది. ఇదే సమయంలో ప్రతిపక్ష నాయకుడిగా ఆయన సభకు హాజరైతే ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు అవకాశం ఉంటుందని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. సభకు దూరంగా ఉండటం వల్ల బీఆర్ఎస్ రాజకీయ వ్యూహానికి ప్రయోజనం చేకూరుతుందా, నష్టమా అన్నది రానున్న రోజుల్లో తేలనుంది. కేసీఆర్ రాజకీయంగా మళ్లీ చురుగ్గా వ్యవహరిస్తారా? ప్రజల్లోకి విస్తృతంగా వెళ్తారా? లేక వచ్చే ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని పార్టీ నిర్మాణంపై దృష్టి పెడతారా? అన్న అంశాలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి. ప్రస్తుతం మాత్రం 'సీఎంగానే అసెంబ్లీలోకి వస్తా' అన్న కేసీఆర్ వైఖరిపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది



# అసెంబ్లీ సమరానికి బీఆర్ఎస్ వ్యూహం!

## సెప్టెంబర్ 6న కేసీఆర్ అధ్యక్షతన శాసనసభాపక్ష సమావేశం

**దశ, హైదరాబాద్:** రాష్ట్ర శాసనసభ సమావేశాలు సెప్టెంబర్ 7 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. సెప్టెంబర్ 6న ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసంలో మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సంయుక్త సమావేశం జరగనుంది. మధ్యాహ్నం 1 గంటకు భోజనం అనంతరం కేసీఆర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అంశాలు, ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించే విధానంపై సమావేశంలో చర్చించనున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు ప్రజా సమస్యలపై పార్టీ శాసనసభ్యులకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. సమావేశానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తప్పనిసరిగా హాజరు కావాలని కేసీఆర్ సూచించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది.

# కొండా రాజకీయం... ఇక అసలు ఆట!

## మంత్రి పదవి పోయింది.. కానీ రాజకీయ కథ ముగియలేదు



**దశ, హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో కొండా సురేఖ వ్యవహారం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేబినెట్ నుంచి సురేఖను తప్పించడం, గవర్నర్ ఆమోదం తెలపడం, ఆమె శాఖలు ముఖ్యమంత్రి పరిధిలోకి వెళ్లడంతో ఎపిసోడ్ ఒక దశకు ముగిసినట్టయింది. కానీ.. అసలు రాజకీయ లెక్కలు మాత్రం ఇప్పుడే మొదలయ్యాయన్న చర్చ సాగుతోంది. కొండా సురేఖ కుమార్తె సుష్మిత పటేల్ సీఎం రేవంత్‌రెడ్డిపై బహిరంగ విమర్శలు చేయడంతో వివాదం మొదలైంది. ముఖ్యంగా పరకాల అసెంబ్లీ సీటు విషయంలో కొండా కుటుంబానికి, సీఎం వర్గానికి మధ్య దూరం పెరిగిందనే ప్రచారం జరిగింది. సుష్మితకు పరకాల నుంచి పోటీ చేయాలనే ఆసక్తి ఉన్నట్లు వార్తలు వచ్చినా.. సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డినే కొనసాగిస్తామని రేవంత్‌రెడ్డి స్పష్టం చేయడంతో విభేదాలు మరింత ముదిరినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. కూతురు చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని సురేఖ వాదించారు. అయితే పార్టీ క్రమశిక్షణ విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం కఠినంగా వ్యవహరించడంతో చివరకు మంత్రి పదవి కోల్పోవాల్సి వచ్చింది. మరోవైపు తనను కావాలనే పక్కన పెట్టారని, తనపై కుట్ర జరిగిందని సురేఖ ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరులు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులపై ఆమె చేసిన ఆరోపణలు కూడా రాజకీయంగా కలకలం రేపాయి. అయితే ఇవి ఆమె చేసిన ఆరోపణలేనని, వాటిని నిర్ధారించే ఆధారాలు బహిర్గతం కాలేదన్నది గమనార్హం. ఈ వ్యవహారంలో పరకాల సీటు అంశం కీలకంగా మారింది. వరంగల్ ప్రాంతంలో కొండా కుటుంబానికి ఉన్న రాజకీయ పరిచయాలు, మరోవైపు రేవంత్‌రెడ్డి తనకు అనుకూలమైన నాయకత్వాన్ని బలోపేతం చేసుకునే ప్రయత్నాలు.. ఈ రెండింటి మధ్య రాజకీయ దూరం పెరిగిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అయితే ఇది రాజకీయ వర్గాల్లో జరుగుతున్న అంచనా మాత్రమే. సురేఖను కేబినెట్ నుంచి తప్పించిన తర్వాత కీలక పదవుల్లో బీసీ మహిళలకు చోటు కల్పించడం కూడా చర్చకు దారితీసింది. గద్వాల్ విజయలక్ష్మి, నేరెళ్ల శారద, జీ. సుధారాణిలకు బాధ్యతలు అప్పగించారు. ఈ మార్పులను కొందరు రాజకీయ కోణంలో చూస్తున్నప్పటికీ.. ప్రభుత్వం మాత్రం వీటి వెనుక ప్రత్యేక రాజకీయ కారణాలున్నట్లు అధికారికంగా వెల్లడించలేదు. మంత్రి పదవి కోల్పోయినంత మాత్రాన కొండా కుటుంబం రాజకీయంగా ముగిసిపోయిందని చెప్పలేం. వరంగల్ ప్రాంతంలో ఆ కుటుంబానికి ఉన్న పరిచయాలు, అనుచర బలం ఇప్పటికీ రాజకీయంగా ప్రాధాన్యం కలిగిన అంశాలే. దీంతో ఇక కొండా కుటుంబం తదుపరి అడుగు ఏమిటన్నదే ఆసక్తికరంగా మారింది. కాంగ్రెస్‌లోనే కొనసాగుతారా? కొంతకాలం మౌనంగా ఉంటారా? లేక రాజకీయంగా మరో మార్గాన్ని ఎంచుకుంటారా? అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. మంత్రి కుర్చీ పోయింది.. కానీ కొండా రాజకీయ కథకు మాత్రం ఎండ్‌కార్డ్ పడలేదన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో వినిపిస్తున్న మాట.

# ఐఫోన్ కోసం గంజాయి దందా!

**మొదటి పేజీ తరువాయి**

12 కిలోల గంజాయిని తరలిస్తుండగా ఖమ్మం జిల్లా వైరా క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు పట్టుకున్నారు. పెద్దపల్లికి చెందిన మిత్ర చైతన్య (21), హేమలత (20) ఒడిశాలోని పసుపులంకలో రూ.16 వేలకు 12 కిలోల గంజాయిని కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. దానిని హైదరాబాద్‌లో సుమారు రూ.6 లక్షలకు విక్రయించేందుకు తీసుకెళ్తుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. పోలీసులను చూసి బైక్ ఆపకుండా తప్పించుకునేందుకు ప్రయత్నించినప్పటికీ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయితో పాటు నాలుగు సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ప్రియురాలి బర్త్‌డేకు ఐఫోన్ కొనివ్వాలనే ఉద్దేశంతో గంజాయి విక్రయానికి పాల్పడినట్లు మిత్ర చైతన్య వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఈ జంటకు గంజాయి విక్రయించిన భగవాన్ హంతాల్‌తో పాటు హైదరాబాద్‌లో వారి నుంచి గంజాయి కొనుగోలు చేయాల్సిన శశి, నాగుల పరారీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారి కోసం గాలింపు కొనసాగుతోంది.

# కొండా ఫ్యామిలీ 'ప్లాన్ బీ' ఏంటి?

## మౌనం వీడిన సురేఖ.. త్వరలో కీలక నిర్ణయం ప్రకటిస్తానంటూ సంకేతాలు

దశ, హైదరాబాద్ : మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ అయిన ఎమ్మెల్యే కొండా సురేఖ ఎట్టకేలకు మౌనం వీడారు. "నిరీక్షణ ముగిసింది.. త్వరలో కీలక నిర్ణయం ప్రకటిస్తా" అంటూ సోషల్ మీడియా వేదికగా ఆమె చేసిన ప్రకటన రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇంతకీ సురేఖ ప్రకటించబోయే నిర్ణయం ఏమిటన్నదానిపై చర్చ మొదలైంది. మరోవైపు సురేఖ కుమార్తె కొండా సుస్మిత ఘాటుగా స్పందించారు. సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే తన తల్లిపై పోటీ చేయాలని సవాల్ విసిరారు. తన వ్యక్తిగత వ్యాఖ్యలకు తన తల్లిపై చర్యలు తీసుకోవడం సరికాదని ఆమె పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి కుటుంబంపై తాను చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతమైనవేనని, వాటిని పార్టీని విమర్శించినట్లుగా చూడొద్దని స్పష్టం చేశారు. తన తల్లిని బర్తరఫ్ చేయడం బాధ కలిగించిందని సుస్మిత అన్నారు. ఈ వ్యవహారంపై సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే సురేఖ బర్తరఫ్‌కు దారితీసిన అంశాలపై అధికార కాంగ్రెస్ నుంచి వెలువడిన వివరణలు, సురేఖ కుటుంబం చేస్తున్న వాదనలు పరస్పరం భిన్నంగా ఉన్నాయి.
ఇదిలా ఉండగా సురేఖ భర్త కొండా మురళి మీసాలు మెలివేయడం, కుటుంబ సభ్యుల ఘాటు వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు తెరతీశాయి. సురేఖ తదుపరి నిర్ణయం, కుటుంబం అనుసరించబోయే రాజకీయ వ్యూహంపై ఉత్కంఠ నెలకొంది. ఆమె ఏ ప్రకటన చేయబోతున్నారన్నదే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

# ముఖ్యమంత్రీ.. చెత్త పనులు మానుకో!

**మొదటి పేజీ తరువాయి**

లాభం చేకూర్చేందుకు వేలాది మంది కార్మికుల పొట్టకొట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. స్వయం ఉపాధి ద్వారా మెరుగైన ఆదాయం పొందుతున్న వారికి నెలకు కేవలం రూ.16 వేల జీతం ఇచ్చేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. హైదరాబాద్‌లో సుమారు 20 వేల ఆటోల ద్వారా 40 వేల మంది స్వచ్ఛ ఆటో కార్మికులు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తూ ఉపాధి పొందుతున్నారని కవిత తెలిపారు. ప్రభుత్వంపై ఎలాంటి భారం లేకుండా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న వారి ఆదాయంపై ముఖ్యమంత్రి కన్నుపడిందని ఆరోపించారు. ప్రాపర్టీ ట్యాక్స్‌లోనే చెత్త ఛార్జీలను కలిపి వసూలు చేస్తే కార్మికుల ఉపాధి దెబ్బతింటుందని అన్నారు. చెత్త సేకరణ బాధ్యతలను రాంకీకి అప్పగించే ప్రతిపాదనను వెంటనే వెనక్కి తీసుకుని, ప్రస్తుత విధానంలోనే స్వచ్ఛ ఆటో కార్మికులతో చెత్త సేకరణ కొనసాగించాలని కవిత డిమాండ్ చేశారు. నెలకు రూ.16 వేలతో కార్మికులు, వారి కుటుంబాలు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. స్వచ్ఛ ఆటో కార్మికులకు అన్యాయం చేస్తే తెలంగాణ రక్షణ సేన చూస్తూ ఊరుకోదని కవిత హెచ్చరించారు. రాంకీకి కాంట్రాక్టు ఇచ్చే ప్రతిపాదనను ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే ముఖ్యమంత్రి ఇంటి ముందు వెయ్యి ఆటోలతో చెత్త పోస్తామని హెచ్చరించారు. కార్మికులు ఎలాంటి బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదని, వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా స్వయం ఉపాధి పొందుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న స్వచ్ఛ ఆటో కార్మికులు సైనికులతో సమానమని కవిత అన్నారు. వారికి ప్రభుత్వం రూ.20 లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. రాంకీ సంస్థ నిర్వహిస్తున్న డంపింగ్ యార్డ్ వద్ద కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లోనే ఈ అంశంపై ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు స్వచ్ఛ ఆటో కార్మికులు పాల్గొన్నారు.




# 56వ ఇండస్ట్రియల్ అండ్ ఇంజనీరింగ్ ఎక్స్‌పో ప్రారంభం

**దశ, హైదరాబాద్:** నగరంలో 56వ ఇండస్ట్రియల్ అండ్ ఇంజనీరింగ్ ఎక్స్‌పో ప్రారంభమైంది. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో హైదరాబాద్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశంలోని వివిధ నగరాలకు చెందిన 100కు పైగా ఎగ్జిబిటర్లు పాల్గొంటున్నారు. రోబోటిక్స్, పారిశ్రామిక ఆటోమేషన్, మెషిన్ టూల్స్, సౌర విద్యుత్, ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాలకు చెందిన 12 వేలకుపైగా ఉత్పత్తులను ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. పరిశ్రమల్లో వస్తున్న ఆధునిక సాంకేతికత, నూతన ఆవిష్కరణలు, వ్యాపార అవకాశాలను ఒకే వేదికపై పరిచయం చేసేందుకు ఈ ఎక్స్‌పో దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

# 'ఈఓఎస్05' సక్సెస్.. ఇస్రో సత్తా!

**దశ, హైదరాబాద్ :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో విజయాన్ని సాధించింది. రక్షణ, విపత్తు నిర్వహణకు కీలకమైన ఈఓఎస్05 (జీశాట్ 1ఏ) ఉపగ్రహాన్ని జీఎస్ఎల్‌వీఎఫ్17 ద్వారా విజయవంతంగా ప్రయోగించింది. శ్రీహరికోటలోని షార్ నుంచి శుక్రవారం తెల్లవారుజామున 2:55 గంటలకు నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్.. 18 నిమిషాల్లో 2,367 కిలోల ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి చేర్చింది. భూస్థిర కక్ష్యలో ఉండే ఈ ఉపగ్రహం భారత ఉపఖండాన్ని ప్రతి 10 నిమిషాలకు ఒకసారి చిత్రీకరించే సామర్థ్యం కలిగి ఉంది. వరదలు, తుపాన్లు, కార్చిచ్చులు వంటి విపత్తులతో పాటు పంటలు, అటవీ ప్రాంతాలు, నీటి వనరుల పర్యవేక్షణకు ఇది ఉపయోగపడనుంది. 2021లో జీఎస్ఎల్‌వీఎఫ్10 ప్రయోగం విఫలమైన నేపథ్యంలో తాజా విజయం ఇస్రో శాస్త్రవేత్తల పట్టుదలకు నిదర్శనంగా నిలిచింది.

# కొండా సురేఖ భర్తరఫ్.. బాధ కలిగించింది

**మొదటి పేజీ తరువాయి**

16 కోచ్‌లు ఉన్నాయి. ఇందులో 11 ఏసీ త్రీ టైర్, గుర్తుచేశారు. తనతోటి మహిళా నాయకురాలు మంత్రిగా తెలంగాణకు సేవలందిస్తున్నందుకు అప్పట్లో సంతోషించామని తెలిపారు. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం నిజంగా బాధ కలిగించిందని డీకే అరుణ అన్నారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి ఎంతో చేశామని చెప్పుకుంటున్న సమయంలో.. తాను బీసీ మహిళా నాయకురాలైన సురేఖపై ఆమె కుమార్తె ఏదో మాట్లాడిందనే కారణంతో చర్యలు తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. ఒక మహిళ రాజకీయాల్లో ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని నిలదొక్కుకుని ఈ స్థాయికి రావడం గొప్ప విషయమని డీకే అరుణ అన్నారు. సురేఖను మంత్రి వర్గం నుంచి భర్తరఫ్ చేయడం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. అయితే ఇప్పటివరకు కొండా సురేఖను బీజేపీలోకి ఆహ్వానించే విషయంలో ఎలాంటి చర్చలు జరగలేదని ఆమె తెలిపారు.




# మహిళలకు హామీల వల.. అమలులో కాంగ్రెస్ మోసం!

**మొదటి పేజీ తరువాయి**

ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పోరుబాట కొనసాగుతుందని, మహిళల హక్కులు, సంక్షేమం కోసం పార్టీ నిరంతరం పోరాడుతుందని మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సురేఖ భర్తరఫ్ బాధ కలిగించింది

**మొదటి పేజీ తరువాయి**



4 ఏసీ టూ టైర్, ఒక ఏసీ ఫస్ట్ క్లాస్ కోచ్ ఉన్నాయి. మొత్తం 823 మంది ప్రయాణించే సామర్థ్యం ఉంది. భవిష్యత్తులో కోచ్‌ల సంఖ్యను 24కు పెంచే అవకాశం ఉంది. భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ 'కవచ్' యాంటీ కొలిజన్ టెక్నాలజీని కూడా ఉపయోగిస్తున్నారు. వేగం, సౌకర్యం, భద్రతను కలిపి అందిస్తున్న వందే భారత్ స్లీపర్.. భారతీయ రైలు ప్రయాణంలో కొత్త అనుభూతిని పరిచయం చేస్తోంది.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com